సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 20 । డిసెంబర్ । 2023



కడప ప్రజల కల సాకారం

బుగ్గ వంకపై పెడస్టల్ బ్రిడ్జిల నిర్మాణంతో నగర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుందని ఉపముఖ్యమంత్రి అంజద్ బాషా అన్నారు. -8లో



'స్త్రీ నిధి'కి కన్నం!

పెద్దతిప్పసముద్రం మండలంలో స్త్రీ నిధి పొదుపు సొమ్ముకు రక్షణగా ఉండాల్సిన సంఘమిత్రలే స్వాహా చేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 205 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	469	470
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 108.300 కిలోలు

బంగారు భవితకు సాంకేతిక విద్య

- రెండో ఏటా బృహత్తర కార్యక్రమం
- ప్రభుత్వ పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు కానుక
- జిల్లాలో మొత్తం 19279 ట్యాబ్‌ల పంపిణీకి సిద్ధం



సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లు చేత పట్టుకున్న ఎనిమిదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం రెండో ఏటా విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 21వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ట్యాబ్‌లను మండలాల వారీగా పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు చేరవేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు 19279 ట్యాబ్‌లు అందించాలని అధికారులు నిర్ణయించారు. పాఠశాలల్లో సంప్రదాయ పద్ధతులలో కాకుండా సరికొత్తగా ఈ–లెర్నింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలనే లక్ష్యంలో భాగంగానే ఈ–ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. శాంసంగ్ సంస్థ తయారు చేసిన ఈ–ట్యాబ్‌లలో బైజూస్‌కు చెందిన ఎడ్యుకేషన్ మెటీరియల్ ఉచితంగా లభించనుంది. ఈ కంటెంట్ కోసం ప్రభుత్వం వందల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. కానీ విద్యార్థులకు రెండో విడతగా ట్యాబ్, కంటెంట్ ఉచితంగానే అందించనున్నారు.

డిజిటల్ విప్లవం

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీతో ప్రతి బడిలోనూ డిజిటల్ విప్లవం వస్తోంది. గతేడాది ట్యాబ్‌లను అందుకున్న విద్యార్థులకు వారి మేథాశక్తిని పెంచుకోవడంలో భాగంగా ఉపకరించాయని చెప్పవచ్చు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి జగనన్న ప్రభుత్వం రెండవసారి శ్రీకారం చుట్టింది. సమాజంలో ఉన్న అంతరాలు తొలగాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులతోపాటు వీరికి చదువు చెబుతున్న టీచర్లకు 3140 ట్యాబ్‌లు ఇస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెట్ పాఠశాలల్లో ఉన్న వారందరికీ ఈ ట్యాబ్‌లు అందిస్తారు. ఏటా 8వ తరగతిలోకి వచ్చే విద్యార్థికి ట్యాబ్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో ఇంగ్లిషు, తెలుగులోనూ సబ్జెక్టులు ఉంటాయి. బాగా అర్థం కావడానికి అన్ని భాషలలో పాఠాలు ఉంటాయి. ట్యాబ్‌ల వల్ల ఎంతో మేలు జరుగుతోంది. సులువుగా పాఠాలు అర్థమయ్యేందుకు అవకాశం ఏర్పడింది. బైజూస్ కంటెంట్ సులభతరంగా అర్థం చేసుకునేందుకు ఉపకరిస్తుంది. సెక్యూర్డ్ డిజిటల్ కార్డు కూడా ట్యాబ్‌లలో ఉంటుంది. ఇంటర్నెట్ లేకపోయినా ఆఫ్‌లైన్‌లో కూడా ఈ ట్యాబ్‌ల ద్వారా పాఠాలు వినే అవకాశం ఉంటుంది.

జిల్లాలోని 30 మండలాల్లో 16589 మంది విద్యార్థులతోపాటు 3140 మంది ఉపాధ్యాయులకు 19279 ట్యాబ్‌లు అందివ్వనున్నారు. బి.కొత్తకోట మండలంలో 574 మంది విద్యా ర్థులు, 117 మంది ఉపాధ్యాయులకు గాను 691 ట్యాబ్‌లు, చిన్నమండెం మండలంలో 365 మంది విద్యార్థులు, 69 మంది ఉపాధ్యాయులకు గాను 434 ట్యాబ్‌లు, చిట్వేలి మండలం 426 మంది విద్యార్థులు, 68 మంది ఉపాధ్యాయులకు గాను 494, గాలివీడు మండలం 430 మంది విద్యార్థులు, 73 మంది ఉపాధ్యాయులకు 503, గుర్రంకొండ 428 మంది విద్యార్థులు, 95 మంది ఉపాధ్యాయులకు 523, కేవీపల్లి మండలం 501 మంది విద్యార్థులు, 118 మంది ఉపాధ్యాయులకు గాను 619, కలకడ 431 మంది విద్యార్థులు, 80 మంది ఉపాధ్యాయులకు గాను 511, కలికిరి 436 మంది విద్యార్థులు, 93 మంది ఉపాధ్యాయులకు 529, రైల్వేకోడూరు 618 మంది

జిల్లాలోని 30 మండలాల్లో..

విద్యార్థులు, 101 మంది ఉపాధ్యాయులకు 719, కురబలకోట 456 మంది విద్యార్థులు, 72 మంది ఉపాధ్యాయులకు 528, లక్కిరెడ్డిపల్లి 410 మంది విద్యార్థులు, 77 మంది ఉపాధ్యాయులకు 487, మదనపల్లి 1883 మంది విద్యార్థులు, 290 మంది ఉపాధ్యాయులకు 2173, ములకలచెరువు 452 మంది విద్యార్థులు, 101 మంది ఉపాధ్యాయులకు 553, నందలూరు 402 మంది విద్యార్థులు, 84 మంది ఉపాధ్యాయులకు 486, నిమ్మనపల్లి 370 మంది విద్యార్థులు, 92 మంది ఉపాధ్యాయులకు 462, ఓబులవారిపల్లె 537 మంది విద్యార్థులు, 105 మంది ఉపాధ్యాయులకు 642, పెద్దమండెం 409 మంది విద్యార్థులు, 88 మంది ఉపాధ్యాయులకు 497, పెద్ద తిప్పసముద్రం 397 మంది విద్యార్థులు, 86 మంది ఉపాధ్యాయులకు 483, పెనగలూరు 442 మంది విద్యార్థులు, 85 మంది ఉపాధ్యాయులకు 527, పీలేరు 996 మంది విద్యార్థులు, 181 మంది ఉపాధ్యాయులకు 1177, పుల్లంపేట 390 మంది విద్యార్థులు, 77 మంది ఉపాధ్యాయులకు 467, రాజంపేట 716 మంది విద్యార్థులు, 147 మంది ఉపాధ్యాయులకు 863, రామాపురం 385 మంది విద్యార్థులు, 72 మంది ఉపాధ్యాయులకు 457, రామసముద్రం 565 మంది విద్యార్థులు, 116 మంది ఉపాధ్యాయులకు 681, రాయచోటి 1311 విద్యార్థులు, 202 ఉపాధ్యాయులకు 1513, సంబేపల్లె 490 విద్యార్థులు, 89 ఉపాధ్యాయులకు 579, సుండుపల్లె 469 మంది విద్యార్థులు, 91 మంది ఉపాధ్యాయులకు 560, తంబళ్లపల్లి 387 మంది విద్యార్థులు, 73 మంది ఉపాధ్యాయులకు 460, వాయల్పాడు 499 మంది విద్యార్థులు, 114 మంది ఉపాధ్యాయులకు 613, వీరబల్లి 414 మంది విద్యార్థులు, 84 మంది ఉపాధ్యాయులకు 498 ట్యాబ్‌లు అందించనున్నారు.

బాగుపడాలంటే..



భావి భారత పౌరుల తలరాతలు మారాలంటే చదువు అనే ఒక్క ఆస్తి ద్వారానే మారుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనకు ఎంతో ఇష్టమైన చిన్నారుల భవిష్యత్తు కోసం చేస్తున్న మంచి కార్యక్రమం. ప్రపంచ విపణిలో పోటీతత్వాన్ని తట్టుకునే విధంగా రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులను సైతం అందుబాటులో ఉన్న అధునాతన టెక్నాలజీతోనే తీర్చిదిద్దుతున్నాం. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్నాం. వారంతా పదో తరగతి పరీక్షలు రాసే సమయానికి సుశిక్షితులను చేసేందుకు ఈ ట్యాబ్‌లు ఉపయోగపడతాయి.
– శ్రీరామ్ పురుషోత్తం, డీఈఓ

చిన్నారుల సృజనాత్మకతకు పదును

మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



రాయచోటిలో విద్యార్థి తయారు చేసిన నమూనాను పరిశీలిస్తున్న జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి

రాయచోటి: చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లలో విద్యార్థులు రూపొందించిన నమూనాలను ప్రదర్శనకు పెట్టారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రదర్శనలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 30 మండలాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీస్తాయని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. అన్నమయ్య జిల్లాలోని 314 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నుంచి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్నారు. మొత్తం 942 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి రాయచోటి, సంబేపల్లె మండలాల్లోని సైన్స్ ఫెయిర్ నిర్వహణ తీరును పరిశీలించారు. మండలాల పరిధిలో ఆయా మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు. ప్రతి మండలం నుంచి మూడు అత్యుత్తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. వీరు ఈ నెల 23వ తేదీన రాయచోటిలోని అర్చన విద్యాసంస్థలలో నిర్వహించే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనేలా జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

పాలిజియో బోర్డుకు ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న చంద్రశేఖర్

బి.కొత్తకోట: మండలంలోని బడికాయలపల్లె జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు నామా చంద్రశేఖర్ తయారు చేసిన పాలి జియో బోర్డుకు ఈ నెల 17న శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి బోధన అభ్యాస ప్రదర్శనలో ప్రథమ బహుమతి దక్కింది. ఆ జిల్లా డీఈఓ వెంకటేశ్వరరావు రూ.5 వేల నగదు బహుమతి, మెమెంటోను అందించారు. ఈ గుర్తింపు దక్కించుకున్న చంద్రశేఖర్‌ను మంగళవారం బడికాయలపల్లె హైస్కూల్‌లో ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, ఎంఈవో–1 రెడ్డిశేఖర్, ఎంఈవో–2 భీమేశ్వరాచారి, హెచ్‌ఎం మోహన్‌నాయుడు, టీచర్ బి.ఖాదర్‌బాషా, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

పక్కాగా పంట నష్ట నమోదు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి

రాయచోటి: జిల్లాలో తుపాను ప్రభావంతో జరిగిన పంట నష్టాన్ని పక్కాగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ జేడీ చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు రవిరాజు, పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై, వివిధ శాఖల జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్: జిల్లాలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ,శిశుసంక్షేమ శాఖ అధికారిణి ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 20 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు 14, సహాయకుల 42 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మరింత సమాచారం సీడీపీఓలను సంప్రదించాలన్నారు. అభ్యర్థులు 23 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు అందజేయాలని వివరించారు.


అంతర్జాతీయ పోటీలకు ఎంపిక



దేవేంద్ర

రామాపురం: ఢిల్లీలో 2024 మార్చి 2న జరిగే అంతర్జాతీయ వరల్డ్ కప్ షూటింగ్ బాల్ పోటీలకు మండలంలోని బీసీ కాలనీకి చెందిన దేరంగుల దేవేంద్ర ఎంపికయ్యాడు. ఆయన ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి, వారణాసిలో జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి, అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ప్రాథమిక స్థాయి విద్యను బీసీ కాలనీలోని ఎంపీపీఎస్‌లో అభ్యసించాడు. చిన్నప్పటి నుంచే విద్య, క్రీడల పట్ల ఆసక్తి ఉండేది. వ్యాయామ విద్యను ప్రొద్దుటూరులోని రాయలసీమ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పూర్తి చేశాడు. ఇతను నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి. తనకు ఆర్థిక సహకారం అందిస్తే మరిన్ని పతకాలను సాధించి మండలానికి మంచి పేరును తీసుకొస్తానని దేవేంద్ర తెలియజేశారు.

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం



చెరువులో చేపపిల్లలు వదులుతున్న మత్స్యశాఖాధికారి సుస్మిత

నిమ్మనపల్లె: మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జిల్లా మత్స్యశాఖాధికారి సుస్మిత అన్నారు. మంగళవారం మండలంలోని బాహుదా ప్రాజెక్ట్ పరిధిలోని తవళం కోమటివానిచెరువు, నిమ్మనపల్లె అహోబిల నాయునిచెరువుల్లో ఎఫ్‌డీఓ సుబ్బనర్సయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డితో కలిసి ఆమె చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో మత్స్యసహకార సొసైటీ అధ్యక్షుడు రమణ, ఉపాధ్యక్షులు రమణారెడ్డి, సర్పంచ్ చంద్రాయుడు, నాయకులు శంకర, గంగాధర, విజయకుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ శిక్షణతో క్రమశిక్షణ



జిల్లా భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ నూతన అసోసియేషన్ ఎంపికలో పాల్గొన్న స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు

రాయచోటి : స్కౌట్ శిక్షణతో క్రమశిక్షణ పెరుగుతుందని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర సెక్రటరీ భానుమూర్తిరాజు తెలిపారు. మంగళవారం రాయచోటిలోని బాలికల హైస్కూల్‌లో జరిగిన అన్నమయ్య జిల్లా భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ నూతన అసోసియేషన్ ఎంపిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 82 మంది స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు ఈ నూతన కార్యవర్గ ఎంపికలో పాల్గొన్నారు. ప్రెసిడెంట్‌గా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, వైస్ ప్రెసిడెంట్‌గా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిస్ట్రిక్ట్ చీఫ్ కమిషనర్‌గా జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్‌పురుషోత్తం, జిల్లా కార్యదర్శిగా మడితాటి నరసింహారెడ్డి, జిల్లా ట్రెజరర్‌గా మార్ల ఓబుల్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్‌లుగా విశ్వనాథం, నిర్మల, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కమిషనర్లుగా ఉప విద్యాశాఖ అధికారిణి వరలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌బాబు, ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు, రెడ్డెన్న, పద్మజ, జాయింట్ సెక్రటరీగా సులోచన ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో లీడర్ ట్రైనర్ శకుంతల, ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర తదితరులు పాల్గొన్నారు.

లంకమలలో కేంద్ర బృందం



సిద్దవటం: సిద్దవటం రేంజిలోని లంకమల అభయారణ్యంలో మంగళవారం కేంద్ర శాస్త్రవేత్తల బృందం శ్యామల్ తికాదర్, ఐశ్వర్య మహేశ్వరి, జె.ఎ.జాన్సన్ పర్యటించారు. జీవ వైవిధ్య స్థితిగతులు, వైల్డ్‌లైఫ్ శాంక్చరీల అభివృద్ధి, అడవి జంతువుల మనుగడ తదితరాలను పరిశీలించారు. అటవీ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌ఓ స్వామి వివేకానంద, సిద్దవటం రేంజర్ బి. కళావతి, డిప్యూటీ రేంజర్ కె.ఓబులేశు, ఎఫ్‌బీఓ విశ్వనాథ్ పాల్గొన్నారు.

జలవనరుల శాఖ సేవలు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: జిల్లాలో జలవనరుల శాఖ సేవలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాయచోటిలో ఇరిగేషన్ ఎస్ఈ, జిల్లా జలవనరుల శాఖ అధికారి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హంద్రీనీవా కాలువల నిర్మాణం పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపై ఎస్ఈతో చర్చించారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న చెరువులను కృష్ణాజలాలతో నింపే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం వెలిగల్లు ప్రాజెక్టు డివిజినల్ కార్యాలయం కూడా రాయచోటిలో ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చొరవతో జిల్లా కేంద్రంలో ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు కావడం పట్ల ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులు, కాంట్రాక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వెంకట్రామయ్య, డీఎస్ కృష్ణమూర్తి, డీఈలు వెంకటేశ్వరరావు, భరత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, స్టేట్ సివిల్ సప్లయిస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, ఫయాజ్ అహ్మద్, ఎంపీటీసీ కాకులపల్లె రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

- రాజంపేటలో వంద పడకల ఆసుపత్రి
- రూ.21 కోట్లతో నిర్మాణం
- 21న సీఎం జగన్ పుట్టిన రోజున ప్రారంభం



రాజంపేటలో రూ.21 కోట్లతో నిర్మించిన ప్రాంతీయ వైద్యశాల



మాతాశిశుసంరక్షణ కేంద్రం

రాజంపేట: ప్రజల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాజంపేటలో రూ.21.50 కోట్లతో వంద పడకల సామర్థ్యంతో ప్రాంతీయ వైద్యశాల నిర్మించింది. కార్పొరేట్ హాస్పిటల్‌ను మించి నిర్మించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఈ నెల 21న అందుబాటులోకి తీసుకురానున్నారు.

నాలుగు బ్లాక్‌లలో వైద్య సేవలు

పెద్దాసుపత్రిలో నాలుగు బ్లాక్‌లలో వివిధ రకాల ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు వీలుగా అధునాతన రీతిలో నిర్మాణాలు జరిగాయి. ఆవరణం అంతటా పరిశుభ్రం, ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడేలా వైద్యశాల రూపుదిద్దుకుంటోంది. మంచి నీటి సరఫరా, ఆక్సిజన్ ప్లాంట్, పోస్టుమార్టం గదితోపాటు ప్రవేశ మార్గాలు, ఆసుపత్రి క్యాంపస్‌లో విశాలమైన సీసీ రోడ్లు నిర్మితం చేశారు.

మూడు ఆపరేషన్ల థియేటర్లు

ప్రాంతీయ వైద్యశాలలో నూతనంగా మూడు ఆపరేషన్ థియేటర్లు నిర్మించారు. అందులో అవసరమైన అధునాతన సామగ్రి, పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. వంద పడకల సామర్థ్యం పూర్తి స్థాయిలో అమలు చేసేలా సెకండరీహెల్త్ చూసుకుంటోంది. ఇటీవల రోగులకు డైట్ కూడా ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అధునాతన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పేద వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఇప్పటికే హార్ట్ అటాక్ వస్తే గోల్డెన్ అవర్ కాపాడేందుకు ఈ ఆసుపత్రిలో స్టెమీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఆయుస్మాన్‌భారత్, ఆయిస్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ప్రత్యేకంగా నిర్మితం చేశారు.

ప్రభావతమ్మ, ఆకేపాటి, మేడాల కృషి

రాజంపేట ప్రాంతీయ వైద్యశాల అభివృద్ధికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి విశేష కృషి చేశారు. ఫలితంగా పార్లమెంట్ హెడ్‌క్వార్టర్‌లో అత్యాధునిక సదుపాయాలు కలిగిన ప్రాంతీయ వైద్యశాల ఏర్పడింది. మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ హయాంలో సీమాంక్ సెంటర్ ఏర్పాటైంది. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వంద పడకల ఆసుపత్రి మంజూరుకు ప్రతిపాదనలు తెర పైకి వచ్చాయి. ప్రస్తుత ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి హయాంలో పూర్తి స్థాయిలో నిర్మించారు.

ప్రాంతీయ వైద్యశాల : రాజంపేట

ఓపీ :	600 -700
వైద్యులు :	5
స్పెషలిస్టులు :	10
నర్సులు :	30
సిబ్బంది :	45
ఆపరేషన్ థియేటర్లు :	3

ప్రాంతీయ వైద్యశాలకు మహర్దశ



రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు మహర్దశ ఏర్పడింది. నూతన భవనాల సముదాయంలో నాలుగు బ్లాక్‌లు ఉన్నాయి. మూడు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. వంద పడకల సామర్థ్యం తగ్గట్టుగా అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నాం. మాతశిశు సంరక్షణ కేంద్రం, ఆయుర్వేద హాస్పిటల్‌కు ప్రత్యేక భవనాలు నిర్మితమయ్యాయి.
–డాక్టర్ పీవీఎస్ రాజు, సూపరింటెండెంట్, ప్రాంతీయ వైద్యశాల

పేదలకు వరం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోంది. ఇందుకు నిదర్శనమే రాజంపేట పార్లమెంటరీ హెడ్‌క్వార్టర్‌లో అధునాతన హంగులతో ప్రాంతీయ వైద్యశాల ఏర్పాటు చేశారు. వంద పడకల ఆసుపత్రి రాజంపేట పరిసర ప్రాంతీయులకు వరం. ఈ ఆసుపత్రి ఏర్పాటుకు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ కృషి అభినందనీయం.
–రాముయాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు, మున్సిపాలిటీ

26 నుంచి ఆడుదాం ఆంధ్ర : కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభించి విజయవంతం చేయడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఆడుదాం ఆంధ్ర, రెవెన్యూ, ఎన్నికల అంశాలపై ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఆర్డీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అంశంలో భాగంగా అసైన్‌మెంట్ ల్యాండ్ రీ వెరిఫికేషన్‌లో తప్పులు ఉండరాదన్నారు. ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా అంశంలో భాగంగా పీఎస్ఈ, డీఎస్ఈలో వందశాతం ఫారం 7 జనరేట్ చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా స్పోర్ట్స్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం : జూదం ఆడుతున్న ఆరుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామాంజనేయుడు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... మండలంలోని పాపేపల్లె పంచాయతీ పెద్దతురకపల్లెకు సమీపంలో జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. జూదరుల నుంచి రూ. 5200 నగదును స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. గ్రామాలలో ఎక్కడైనా జూదం నిర్వహించినా, నాటుసారా తయారీ, విక్రయాలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నాటుసారా ఊట ధ్వంసం



పోలీసులు ధ్వంసం చేసిన సారా ఊట

బి.కొత్తకోట : మండలంలోని తుమ్మనంగుట్ట పంచాయతీ సుబ్బిరెడ్డిగారిపల్లెలో సోమవారం రాత్రి పోలీసులు నాటుసారా తయారీపై దాడులు నిర్వహించినట్లు స్టేషన్‌హౌస్ ఆఫీసర్ ప్రశాంత్ తెలిపారు. మూడు వేర్వేరు ప్రాంతాల్లో సారా తయారీ చేస్తుండగా దాడులు చేసి 500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారు చేస్తున్న గణపతిపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేశామని తెలిపారు.

విజిలెన్స్ అధికారుల విచారణ

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి హౌసింగ్ కార్యాలయ పరిధిలో జరిగిన అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. మంగళవారం జిల్లా హౌసింగ్ కార్యాలయంతోపాటు రాయచోటి పరిధిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీల నిర్మాణాలలో లబ్ధిదారులకు అందించే సిమెంట్, ఇసుక, కడ్డీల కేటాయింపు విషయంలో లబ్ధిదారుల నుంచి సమాచారాన్ని సేకరించారు. అలాగే రెండు రోజుల కిందట జిల్లా కార్యాలయంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ల మధ్య జరిగిన సంఘటనపై కూడా ఆరా తీశారు. విచారణలో 15 మంది సిబ్బంది చేత వేర్వేరుగా సంఘటనకు సంబంధించిన వివరాలను, జరిగిన అవినీతి అక్రమాలపై రాతపూర్వకంగా సమాచారాన్ని సేకరించినట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. అలాగే మామూలు తీసుకొని వర్క్ ఇన్‌స్పెక్టర్లకు పదోన్నతులు కల్పించారన్న ఆరోపణలపై కూడా విజిలెన్స్ అధికారులు సమాచారాన్ని రాబట్టినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గంగాద్రి మృతదేహం

ములకలచెరువు : పాల ట్రక్కు ఢీ కొని స్కూటరిస్టు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లెకు చెందిన ఎస్. గంగాద్రి(24) తన ద్విచక్రవాహనంలో పనుల మీద ములకలచెరువు మండలం వేపూరికోటకు వచ్చాడు. పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా చీకుచెట్టుపల్లె వద్ద ఎదురుగా వస్తున్న పాల ట్రక్కు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గంగాద్రి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గాయత్రి సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంగాద్రి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

స్త్రీ నిధికి కన్నం!

కంచే చేను మేసిందన్న చందంగా మహిళా సంఘాల సొమ్ముకు రక్షణగా ఉండాల్సిన సంఘమిత్రలే సొమ్మును స్వాహా చేశారు. పూటకో పేరు చెప్పి వసూళ్ల దందా చేస్తున్నారు. ఎందుకని అడిగితే 'అన్నింటికీ జవాబివ్వాలా' అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారు. తీసుకున్న నగదుకు రశీదు ఇవ్వకుండా.. రికార్డుల్లో జమ చేయకుండా లక్షల రూపాయాలు స్వాహా చేసిన ఉదంతం వెలుగు చూసింది.

- సంఘమిత్రల నిర్వాకం
- ఒక్కో సభ్యురాలి నుంచి బలవంతపు వసూళ్లు
- చోద్యం చూస్తున్న అధికారులు



పెద్దతిప్పసముద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం

పెద్దతిప్పసముద్రం : పెద్దతిప్పసముద్రం మండలంలో స్త్రీ నిధి పొదుపు సొమ్ములో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళా సంఘాల నిర్వహణ బాధ్యతలు తీసుకున్న సంఘమిత్రలు సభ్యుల నుంచి బలవంతపు వసూళ్లకు కూడా పాల్పడినట్లు సమాచారం. స్త్రీ నిధి, కమ్యూనిటి ఇన్‌వెస్ట్‌మెంట్ ఫండ్ (సీఐఎఫ్), పొదుపు సొమ్ము పేరిట నిధులు గోల్‌మాల్ చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా గ్రూపు సభ్యులు మూకుమ్మడిగా తీసుకునే రుణానికి ప్రతి నెలా బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి కంతుల వారీగా చెల్లిస్తూ మరో వైపు పొదుపు జమ చేయడం సాధారణం. అయితే స్త్రీ నిధి పేరిట కూడా సంఘమిత్రలు పొదుపు పేరుతో ఒక్కో మహిళా సభ్యురాలి నుంచి ప్రతి నెలా రూ.200 నుంచి రూ.400ల వరకు వసూలు చేశారని.. సదరు నగదుకు సంభంధించి ఎలాంటి రశీదులు ఇవ్వలేదని పలు గ్రామాల మహిళలు ఆరోపిస్తున్నారు. కొంత మంది సంఘమిత్రలు రికార్డుల్లో నామమాత్రంగా రాసి చేతులు దులుపుకుని సొమ్మంతా స్వాహా చేసారని, మరి కొందరు ఏదో ఒక కాగితంలో రాసిచ్చి మహిళలను నిలువునా ముంచారని తెలుస్తోంది. వసూలు చేస్తున్న డబ్బులు ఎందుకు అని మహిళలు ప్రశ్నిస్తే రికార్డుల నిర్వహణ కోసమని సాకులు చెబుతున్నారని మీరిచ్చే రూ.200లకు అన్నీ సమాధానాలు చెప్పాలా అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారనే విమర్శలు కూడా వస్తున్నాయి.

లక్షల్లో స్వాహా!

మండలంలో 1200 దాకా మహిళా సంఘాలు ఉండగా సంఘానికి 10 మంది చొప్పున 12 వేల మంది మహిళలు సభ్యులుగా ఉంటారు. స్త్రీ నిధి పేరిట ప్రతి నెలా ఒక్కో సభ్యురాలి నుంచి రూ.200లు తీసుకున్నా రూ.2,40 లక్షలు అవుతుంది. ఇది కేవలం ఒక నెలకు సంబధించిన లెక్క మాత్రమే. ఈ లెక్కన ఒక్క ఏడాదికి లెక్క వేస్తే రూ.28.80 లక్షలు అవుతుంది. ఇదిలా ఉండగా మరి కొన్ని గ్రామ సమాఖ్య పరిధుల్లో స్త్రీ నిధి ద్వారా రుణం తీసుకుని వడ్డీతో సహా తిరిగి చెల్లించినా ఆన్‌లైన్‌లో మాత్రం ఇంకా కొంత అప్పు ఉన్నట్లు కూడా వెల్లడి కావడంతో పలువురు మహిళలు అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ల చుట్టూ కూడా తిరిగారు. కొంత మంది అధికారులు ప్రత్యేక చొరవ చూపడంతో సదరు మహిళా గ్రూపు సభ్యులకు ఊరట లభించింది. అంతేగాక స్త్రీ నిధిలో రుణం పొంది ప్రతి నెలా క్రమం తప్పకుండా రుణాలు పూర్తిగా తిరిగి చెల్లించి 10 నెలలు కావస్తున్నా మాలాంటి వాళ్లకు తిరిగి కొత్తగా రుణాలు ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డీఆర్‌డీఏ జిల్లా ఉన్నతాధికారులు నిధుల దుర్వినియోగంపై మిగిలిన వీవోల్లో ఆడిట్ నిర్వహించేటప్పుడు ఆయా సంఘాల సభ్యుల సమక్షంలో సమగ్రంగా విచారణ జరిపి సమగ్రంగా ఆరా తీస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఈ విషయంపై ఏపీఎం శ్రీనివాసులను వివరణ కోరగా డ్వాక్రా సంఘాల సభ్యుల నుంచి వంద రూపాయలు నగదు తీసుకున్నా రశీదు కచ్చితంగా ఇవ్వాలి. లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. స్త్రీ నిధి పొదుపు అవకతవకల విషయంపై విచారణ చేపడతామని ఆయన వివరించారు.

నవశకం

సొంతింటి కల సాకారమైంది



సంవత్సరాల కాలంగా సొంతింటి కోసం ఎదురు చూశాం. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే నాకు సొంతిల్లు మంజూరు చేశారు. దీంతో నా కుటుంబంతో కలిసి సొంతంగా ఇల్లు నిర్మించుకున్నాం. ఎంతో ఆనందంగా ఉంది. ఈ ప్రభుత్వ హయాంలో నాకు సొంతింటితో పాటు అమ్మ ఒడి, సున్నావడ్డీ, నా భర్తకు వాహన మిత్ర ఆర్థిక సాయం అందుతోంది. మా కుటుంబం ఎప్పటికీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– మనేరి నీరజ, కొర్నమిట్టపల్లి, గుండ్లూరు గ్రామం, కలికిరి మండలం.

జగనన్న సురక్ష పేదలకు వరం



జగనన్న సురక్ష పథకం పేదలకు వరంలాటింది. ఈ పథకం వల్ల మాకు అవసరమైన కుల, ఆదాయ సర్టిఫికెట్లు ఇంటికొచ్చాయి. పేదలకు అవసరమైన పథకాలను అమలు చేయడం జగనన్నకే సాధ్యం.

– మాదినేని ఆదిలక్షుమ్మ, అనుంపల్లి, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా

కడప ప్రజల కల సాకారం

- డిప్యూటీ సీఎం అంజాద్ బాషా
- నగర మేయర్ సురేష్ బాబుతో కలిసి రూ.20 కోట్లతో బ్రిడ్జిల నిర్మాణానికి భూమి పూజ



బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : బుగ్గ వంకపై పెడస్టల్ బ్రిడ్జిల నిర్మాణంతో నగర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుందని ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. మంగళవారం రవీంద్ర నగర్ లోని షామీరియా దర్గా సమీపంలో, నాగరాజుపేటలో లా కాలేజీ వద్ద బుగ్గ వంకపై బ్రిడ్జిల నిర్మాణానికి నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రా రెడ్డి, కమిషనర్ ప్రవీణ్ చంద్‌లతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నగర ప్రజలు ఎదురుచూస్తున్న బుగ్గ వంకపై రూ. 20 కోట్లతో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. వరదలు వచ్చిన ప్రతిసారీ రవీంద్ర నగర్, నాగరాజు పేట ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని, ఈ పరిస్థితిని గమనించి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి బుగ్గ వంక నదీ పరివాహ ప్రాంతానికి రక్షణ గోడలు, రోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బుగ్గ వంక నదికి రక్షణ గోడలు నిర్మాణం కోసం రూ.56 కోట్లు వెచ్చించి పనులు పూర్తి చేయడం నగర ప్రజలకు వరమన్నారు. బుగ్గవంక చుట్టూ రక్షణ గోడలు నిర్మించడం వల్ల పరివాహక లోతట్టు ప్రాంతాల ప్రజలు భవిష్యత్తులో నిశ్చింతగా ఉండొచ్చని పేర్కొన్నారు. బుగ్గ వంకకు ఇరువైపులా 40 అడుగుల రోడ్డును రూ.15 కోట్లతో పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రజలకు పెద్ద నగరాలకు వెళ్లకుండా ఎలాంటి అనారోగ్యం వచ్చిన మన జిల్లా కేంద్రం కడపలో రిమ్స్ లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేసుకోవడం జరుగుతోందన్నారు. నగర అభివద్ధికి రూ.2150 కోట్లతో పలు అభివద్ధి పనులు చేపడుతున్నామని ఇందులో కూడళ్ళు, రహదారులు, డ్రైన్ల వేగవంతంగా పనులు నడుస్తున్నాయన్నాయని.. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

నగర మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ... బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న నగర ప్రజలు చాలా ఏళ్లుగా వరదలతో చాలా ఇబ్బందులకు గురయ్యారని వాటన్నిటికీ శాశ్వత పరిష్కారం చూపుతూ.. నేడు బుగ్గ వంక పెడస్టల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. 2004లో దివంగత నేత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి రూ.70 కోట్లతో బుగ్గ వంక రక్షణ గోడలకు అనుమతి మంజూరు చేసి 85 శాతం పనులు పూర్తి చేశారన్నారు. కడప నగరాన్ని ఒక ప్రణాళిక బద్ధంగా అభివద్ధి చేయాలని నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో నగర సుందరీకరణలో భాగంగా వేల కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్లు ముంతాజ్ బేగం, నిత్యానంద రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, అజ్మతుల్లా, రెడ్డి ప్రసాద్, షఫీ, మైనార్టీ శాఖ సలహాదారులు మొహమ్మద్ అలీ బాగ్దాది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి మృతి

ముద్దనూరు : మండలంలోని యామవరం గ్రామంలో ఈనెల 1వతేదీన విద్యుదాఘాతానికి గురైన మోర్త రాజు(40)అనే వ్యక్తి చికిత్స పొందుతూ కాకినాడలో మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు కోనసీమ జిల్లా గంగవరం మండలం శివాల గ్రామానికి చెందిన లారీ డ్రైవరు రాజు యామవరానికి చెందిన ఓ రైతుకు మామిడి చెట్లు తీసుకుని వచ్చాడు. తోటలో మామిడి చెట్లు దించడానికి లారీ పైకి ఎక్కగా.. విద్యుత్ తీగలు తగలడంతో రాజు తీవ్ర గాయాలపాలయ్యాడు మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించారు.డ్రైవరు రాజు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు

కడప అర్బన్ : మద్యం తాగి బైక్ నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్షతో పాటు, రూ. 2500 జరిమానా విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ జెఎస్‌సిఎం కోర్టు తీర్పు చెప్పారు. చిట్టిబోయిన హరికృష్ణ (30) ఈనెల 13న మద్యం సేవించి మోటార్‌సైకిల్ నడుపుతూ ట్రాఫిక్ పోలీసుల బ్రీత్ ఎనలైజర్ తనిఖీలలో పట్టుబడ్డారు. విచారణ సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో మెజిస్ట్రేట్ శిక్ష విధించినట్లు కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. అలాగే మద్యం తాగి ఆటో నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ మహబూబ్ బాషా అనే వ్యక్తికి 30 రోజుల జైలు శిక్షతో పాటు, రూ. 2500 జరిమానా విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ జెఎస్‌సీఎం కోర్టు తీర్పు చెప్పిందని కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలియజేశారు.

ప్రొద్దుటూరులో పేలిన ఐపీ బాంబు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో మరో ఐపీ బాంబు పేలింది. అమ్మవారిశాల సమీపంలో ఉన్న ఓ వ్యాపారి సుమారు రూ. 5.50 కోట్లకు ఐపీ దాఖలు చేశాడు. పట్టణానికి చెందిన 60 మందికి పైగా అతనికి రూ. లక్షల్లో అప్పు ఇచ్చారు. కొన్ని రోజుల నుంచి అతని ఇంటికి తాళం వేసి ఉండటంతో రుణదాతలు ఆందోళన చెందారు. ఈ క్రమంలోనే ఇటీవల అతను ప్రొద్దుటూరులోని సీనియర్ సివిల్ జడ్జికోర్టులో ఐపీ దాఖలు చేశాడు. తనకు రూ. 5.50 కోట్లు మేర అప్పులు ఉన్నట్లు అతను కోర్టులో ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ దాఖలు చేశాడు. ఐపీ విషయం తెలియడంతో బాధితులు లబోదిబో మంటున్నారు. అతనికి అప్పు ఇచ్చిన వారిలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు అధికంగా ఉన్నారు. ఆపోపా కార్యాలయం సమీపంలో నివాసమున్న అతను అద్దాల వ్యాపారం చేయడంతో పాటు పోస్టల్ ఆర్డీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. బెంగళూరులోని బంధువుల ఇంట్లో ఉన్నట్లు తెలుస్తోంది.

అసమానతలు తొలగించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్

కడప రూరల్ : స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు తొలగించేలా పెద్దలు వ్యవహరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని మీటింగ్‌హాలులో డీఎంహెచ్ఓ నాగరాజు ఆధ్వర్యంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు–1994 అండ్ రూల్స్ 1996, లింగ నిష్పత్తి, బాల్య వివాహాలు తదితర అంశాలపై జిల్లా అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి బాబాఫకృద్దీన్ మాట్లాడుతూ సమాజం పుట్టుకతో నుంచి స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు ఉన్నాయన్నారు. అలాగే కుటుంబం నుంచి ఈ విధమైన అసమానతలు లేకుండా తల్లిదండ్రులు చూడాలన్నారు. చట్టాలు అసమానతల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ లింగ వివక్షకు పాల్పడిన సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని తెలిపారు. రీసోర్స్ పర్సన్ మోహన్‌కృష్ణ, సునీత, డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, దిశా పోలీసుస్టేషన్ సీఐ లక్ష్మీదేవి, వివిధ శాఖల అధికారులు ఖాదర్‌బాష, డాక్టర్ అవ్వారు అర్జున్, మూలె సరస్వతి, అబ్దుల్ ఖలీఫ్ పాల్గొన్నారు.

ప్రేమ విఫలం...

యువకుడి ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు : ప్రేయసి మోసం చేసిందని ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మయత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మండలంలోని చౌడసముద్రం పంచాయతీ చెట్లవారిపల్లెకు చెందిన సీనప్ప కుమారుడు సోమశేఖర్(24) ఓ అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లి చేసుకోవాలని యువతికి చెప్పడంతో నిరాకరించింది. మరో యువకుడితో ప్రేమాయణం సాగిస్తున్నట్లు తెలుసుకున్న యువకుడు మనస్థాపానికి గురై జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. దీంతో 90 శాతం శరీర భాగం ఖాళిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు

ఘనంగా బిషప్ గాలి బాలి వసంతోత్సవం



బిషప్ డాక్టర్ గాలిబాలిని సత్కరిస్తున్న క్రైస్తవ సంస్థల ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప, చిత్తూరు జిల్లాల కథోలిక విచారణ గురువు, అపోస్తులిక పాలనాధికారి, బిషప్ రెవరెండ్ డాక్టర్ గాలి బాలి 59వ వసంతోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మరియాపురంలోని సెయింట్ మేరీస్ క్యాథడ్రల్ చర్చిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బిషప్ గాలి బాలి మాట్లాడుతూ దైవం నిర్దేశించిన ప్రాంతాల్లో ఆయన గురించిన సందేశాన్ని సకల జాతి జనులకు వివరించడానికి దేవుడు తనను సాధనంగా వినియోగించుకున్నాడని తెలిపారు. ఆయన కృపతోనే గురుత్వ సేవలో 59 సంవత్సరాలను విజయవంతంగా పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా దైవం పట్ల కృతజ్ఞతా సూచకంగా దివ్య బలిపూజ సమర్పించారు. అతిథులుగా హాజరైన గుంటూరుకు చెందిన రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ పోలే ముత్యం, వైఎస్సార్ సీపీ అధ్యాపకుల విభాగం రాష్ట్ర ప్రతినిధి మాదిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆంధ్ర క్రైస్తవ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కనపాల జోసెఫ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ బిషప్ గాలి బాలి దైవ సేవలో గురుత్వ జీవితాన్ని 59 సంవత్సరాలకు మించి విజయవంతంగా పూర్తి చేయడం అభినందించదగిన విషయమన్నారు. ఫాదర్ సంబటూరు సురేష్ బిషప్ చేసిన అభివృద్ధిని వివరించారు.ఈ సందర్భంగా ఎంపీఎస్ఎస్ఎస్ సంస్థ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బిషప్ ఆవిష్కరించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన గురువులు, మఠకన్నెలు, పెద్దలు, పలు సంఘాల ప్రతినిధులు బిషప్‌ను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం బిషప్‌ను ఎంపీఎస్ఎస్ఎస్ సంస్థలో డైరెక్టర్‌పాదర్ బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో క్యాథడ్రల్ విచారణ గురువులు బిరుసు రాజా, డైరెక్టర్ పాదర్ తలారి బాలరాజు, మేత్రాసన కోశాధికారి పెండ్లికట్ల దేవదాసు, కడప డీన్ ఎండీ ప్రసాద్ రావు, మేత్రాసన విద్యా విభాగం డైరెక్టర్ ఫాదర్ సుధాకర్, పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఏసు వరప్రసాద్‌రావు, ఫాదర్ విజయరావు, విల్సన్, లూర్దురాజు, విజయబాబు, తిరుపతి, చిత్తూరు గురువులు, ఉపదేశులు, చర్చి పెద్దలు, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, జ్యోతి జార్జి తదితరులు పాల్గొన్నారు.

చౌక బియ్యం వాహనం పట్టివేత

బి.కొత్తకోట: కర్ణాటకకు తరలిస్తున్న చౌక బియ్యం వాహనాన్ని మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. వేపమానుకుంట గ్రామంలో కొనుగోలు చేసిన చౌక బియ్యాన్ని టాటాఏస్ వాహనంలో కర్ణాటకకు తరలిస్తున్నారు. పోలీసులు కస్తూర్బా బాలికల విద్యాలయం వద్ద తనిఖీలు నిర్వహించి వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో టమాట క్రేట్లను పైన వేసి కింద పెట్టిన 1,057 కిలోల 28 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు.నిందితుడు కే.నరసింహారెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.



పోలీసులకు పట్టుబడిన చౌక బియ్యం వాహనం

మినీ బస్సు ఢీ.. వ్యక్తికి గాయాలు



ప్రమాద స్థలంలో బోల్తా పడిన మినీ బస్సు

ఒంటిమిట్ట: మండల కేంద్రమైన ఒంటిమిట్ట సమీపంలోని కల్యాణ వేదిక వద్ద ఉన్న వంతెన పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రోడ్డుపై వెలుతున్న అయ్యప్ప దీక్షకుడు కుంభగిరి మనోహర్‌రెడ్డి అనే వ్యక్తిని నిజామాబాద్ నుంచి తిరుమలకు వెలుతున్న మిని బస్సు ఢీ కొట్టింది. స్థానికుల వివరాల మేరకు....అట్లూరు మండలానికి చెందిన కొంత మంది అయ్యప్ప దీక్షను పూనిన భక్తులు ఒంటిమిట్టలోని ఓ రెస్టారెంట్‌లో స్నానాలు ఆచరించి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామిని దర్శించుకుని, తిరిగి అదే రెస్టారెంట్‌కి వస్తుండగా తిరుమలకు వెలుతున్న మినీ బస్సు మనోహర్‌రెడ్డి అనే వ్యక్తిని ఢీ కొట్టగా ఆ వ్యక్తికి రక్తగాయాలు అయ్యాయి. అంతే కాకుండా ప్రమాదానికి కారణమైన మిని బస్సు కూడా బోల్తా పడింది. ఈ బస్సులోని ప్రయాణికులకు ఏమి కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని 108 సహాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. బోల్తా పడిన బస్సును సరి చేసి, వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. దీనిపై పోలీసులకు ఇంకా పిర్యాదు అందలేదు.